క్లుప్తంగా

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్ : ఏలూరు రూరల్ మండలం చాటపర్రులో పేకాటాడుతున్న ఇద్దరిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సిబ్బంది శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.6,010 నగదు, ఒక సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు రూరల్ పోలీసులకు వారిద్దరినీ అప్పగించగా వారు కేసు నమోదు చేశారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నెహ్రూ నగర్‌లో పేకాటాడుతున్న ఆరుగురిని త్రీ టౌన్ ఎస్సై మదీనాబాషా అరెస్టు చేసి, వారి నుంచి రూ.4,750 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేపట్టారు.

యువకుడిపై వేధింపుల కేసు

ఏలూరు టౌన్: ఏలూరు నగరానికి చెందిన ఒక యువతి (16)ని గతంలో స్నేహంగా ఉండే మరో యువకుడు వేధింపులకు గురి చేయడంతో ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరులోని ఓ ప్రాంతానికి చెందిన ఆ యువతి చదువుకునే సమయంలో ఏలూరుకు చెందిన ఆనంద్ అనే యువకుడు స్నేహంగా ఉండేవాడు. వీరిద్దరూ ఫొటోలు పంపుకున్నారు. అనంతరం ఆమె ఉన్నత చదువుల నిమిత్తం విశాఖపట్టణం వెళ్లింది. ఇటీవల పండుగ సందర్భంగా ఏలూరు రావడంతో ఆమెతో మాట్లాడాలంటూ ఏలూరు మినీబైపాస్ రోడ్డులోని ఒక గార్డెన్స్‌కు పిలిపించాడు. తాను చెప్పినట్టు వినకపోతే తన ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతానని బెదిరించాడు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో ఎస్సై మదీనాబాషా కేసు దర్యాప్తు చేపట్టారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు దంత వైద్య విద్యార్థి ఎంపిక

పెదవేగి : సెయింట్ జోసెఫ్ దంత కళాశాల థర్డ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి సీహెచ్ నవీన్ 18వ తేదీ డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల్లో నిర్వహించిన చెస్ క్రీడల ఎంపిక పోటీలో డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ తరఫున ఎంపికైనట్లు కరస్పాండెంట్, సెక్రెటరీ ఫాదర్ జి మోజెస్ తెలిపారు. ఈ ఎంపికను డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ డాక్టర్ ఈ త్రిమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈనెల 26 నుంచి 29 వరకు తిరుచరాపల్లిలో భారతీయ దాస్ యూనివర్సిటీలో సౌత్ జోన్ చెస్ పోటీలను నిర్వహిస్తున్నారని ఆ క్రీడలలో నవీన్ పాల్గొంటారని ఆయన చెప్పారు. ఎంపికైన విద్యార్థిని, ఫిజికల్ డైరెక్టర్ నిట్టా నల్లయ్యను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ స్లీవరాజు, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఎల్ ఫిలిక్స్, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

ఉంగుటూరు: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గోపీనాథపట్నంలో నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మరడ మంగరావు తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనున్న 227వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొంటారని తెలిపారు.

అంబేడ్కర్ మహాశిల్పం ఆవిష్కరణ మరో చరిత్రకు నాంది

విజయవాడకు భారీగా తరలిన ప్రజలు

ఏలూరు టౌన్: విజయవాడ నడిబొడ్డున స్వరాజ్య మైదానంలో మరో చరిత్రకు నాంది పలికారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ఆవిష్కరణ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహాశిల్పాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఏలూరు నియోజకవర్గం నుంచి భారీగా ప్రజలు, అభిమానులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు తరలివెళ్లాయి. ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని నాయకత్వంలో సుమారు 40 బస్సుల్లో ప్రజలు విజయవాడ తరలివెళ్లారు. వీరికి అన్ని సౌకర్యాలను కల్పించారు.

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతం నుంచి ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. 50వ డివిజన్ నుంచి మేయర్ నూర్జహాన్, కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు జెండా ఊపగా పెద్ద సంఖ్యలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు విజయవాడ బయలుదేరి వెళ్లారు. ఏలూరు వన్‌టౌన్, 6, 7, 9 డివిజన్ల నుంచి పార్టీ క్లస్టర్–1 అధ్యక్షుడు సుంకర చంద్రశేఖర్, మహిళా అధ్యక్షురాలు పిల్లంగోళ్ల శ్రీదేవి, కార్పొరేటర్ సబ్బన శ్రీనివాస్, జేసీఎస్ క్లస్టర్–1 కన్వీనర్ మొటమర్రి సదానందం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో అభిమానులు విజయవాడ వెళ్లారు. 16వ డివిజన్ కార్పొరేటర్ జిజ్జువరపు విజయనిర్మల, 18వ డివిజన్ కార్పొరేటర్ ఎం.కేదారేశ్వరి, పార్టీ నాయకులు ఇనపనూరి జగదీష్ ఆధ్వర్యంలో దళిత, బీసీ వర్గాలు చలో విజయవాడకు వెళ్లారు. 40వ డివిజన్ నుంచి క్లస్టర్–3 మహిళా అధ్యక్షురాలు తుమరాడ స్రవంతి ఆధ్వర్యంలో, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పొలిమేర దాసు, ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దళిత, బీసీ, మైనార్టీ వర్గాలు చలో విజయవాడకు వెళ్లారు.

రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు

ఏలూరు (టూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయమహా శిల్ప ఆవిష్కరణ మహోత్సవానికి ఏలూరు నగరం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, దళిత సంఘాల నాయకులు, అభిమానులు, ఉద్యోగులు, కార్మికులు, యువత స్వచ్ఛందంగా తరలివెళ్లారు. శుక్రవారం ఉదయం నుంచే బస్సులు, కార్లు, బైక్‌లపై విజయవాడకు బయలుదేరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ, స్మృతి వనం ప్రారంభోత్సవాన్ని స్వయంగా చూడాలనే ఉత్సాహం ప్రజల్లో కన్పించింది. యువత మోటారు బైక్‌లకు అంబేడ్కర్ జెండాలను కట్టుకుని ర్యాలీగా తరలివెళ్లారు. ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ వాదులు, దళిత సంఘాల నాయకులు వెళ్లారు. జాతీయ సీనియర్ ఎస్సీ నాయకులు పొలిమేర హరికృష్ణ ఆధ్వర్యంలో స్థానిక 43వ డివిజన్ గన్‌బజార్ యూత్ తరలి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచ గర్వించదగ్గ నాయకులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కొనియాడారు. అంతటి మహనీయుని 206 అడుగుల విగ్రహం ఏర్పాటు విజయవాడ నగరానికే కాకుండా యావత్ రాష్ట్రానికే ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. ఇంతటి మహత్కార్యానికి ఆద్యుడైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాల తరుపున ధన్యవాదాలు తెలిపారు. విజయవాడ తరలివెళ్లిన వారిలో ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు సొంగా మధుసూదన్‌రావు, జిల్లా దళిత నాయకులు శేఖర్, పలువురు చర్మకారులు, పలు సంఘాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


ఏలూరు టౌన్: ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో బయలుదేరిన ప్రజలు


ఏలూరు టౌన్: చలో విజయవాడ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కోఆప్షన్ సభ్యుడు పెదబాబు


ఏలూరు టౌన్: అంబేడ్కర్ మహాశిల్పం ఆవిష్కరణకు బయలుదేరిన కార్పొరేటర్ దాసు


ఏలూరు టౌన్: ఏలూరు వన్‌టౌన్ నుంచి బస్సులో చలో విజయవాడకు బయలుదేరిన పార్టీ నాయకులు


ఏలూరు టౌన్: అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు బయలుదేరిన కార్పొరేటర్ కేదారేశ్వరి, పార్టీ నాయకులు జగదీష్


ఏలూరు టౌన్: చలో విజయవాడకు బయలుదేరిన కార్పొరేటర్ తుమరాడ స్రవంతి, పార్టీ నాయకులు


ఏలూరు టౌన్: వన్‌టౌన్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు పిల్లంగోళ్ల శ్రీదేవి, సుంకర చంద్రశేఖర్


ఏలూరు (టూటౌన్): అంబేడ్కర్ స్వాగత ద్వారం వద్ద సంతోష్ కుమార్


ఏలూరు (టూటౌన్): పొలిమేర హరికృష్ణ ఆధ్వర్యంలో విజయవాడ బయలుదేరిన గన్‌బజార్ యూత్

26న ట్రాక్టర్ల ర్యాలీ

ఏలూరు (టూటౌన్): కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించిందని సంయుక్త కిసాన్ మోర్చా - కార్మిక సంఘాల ఐక్య వేదిక నాయకులు విమర్శించారు. శుక్రవారం స్థానిక ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఈ నెల 26న ఏలూరులో నిర్వహిస్తున్న రైతులు, కార్మికులు ట్రాక్టర్లు, బైకుల ర్యాలీను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఏపీ రైతు సంఘం, ఏఐకేఎంఎస్, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, బీకేఎంయూ, కాంగ్రెస్ కిసాన్ సెల్, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు కె.శ్రీనివాస్, పోరండ్ల శ్రీనివాస్, ఎ.రవి, పి.రామకృష్ణ, కేఎస్ఎన్ మూర్తి బండి వెంకటేశ్వరరావు, రాజనాల రామ్మోహనరావు, బి.సోమయ్య, రెడ్డి శ్రీనివాస డాంగే మాట్లాడారు.

బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ విజేతలు వీరే


వాలీబాల్ పోటీల్లో తలపడుతున్న చొదిమెళ్ల, వెంకటాపురం జట్లు


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న సత్రంపాడు, పోణంగి జట్లు


బ్యాడ్మింటన్ ఫైనల్ విజేతగా నిలిచిన గొల్లాయిగూడెం మహిళల జట్టు

ఏలూరు రూరల్ : ఆడుదాం ఆంధ్ర ఏలూరు జోన్ 3 విభాగంలో ఆటల పోటీలు కొనసాగాయి. యువతీ, యువకులు హోరాహోరీగా తలపడ్డారు. శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ కోటదిబ్బలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోటీలు కొనసాగాయి. పురుషుల కబడ్డీ పోటీల్లో సత్రంపాడు సచివాలయం జట్టు పోణంగి సచివాలయం జట్టుపై విజయం సాధించింది. వాలీబాల్ క్రీడాంశంలో చొదిమెళ్ల సచివాలయం జట్టుపై వెంకటాపురం–6 సచివాలయ జట్టు విజేతగా నిలిచింది. ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్ మహిళల ఫైనల్ పోటీలో జేపీ కాలనీ సచివాలయం జట్టును గొల్లాయిగూడెం జట్టు ఓడించింది. పీఈటీలు ప్రతాప్, కె.మురళీకృష్ణ, భోగలింగేశ్వరావు, మురళీకృష్ణ, ప్రసన్న, పి.గోపీ, రమేష్ తదితరులు పోటీల నిర్వహించారు.

నేటి మ్యాచ్‌లు ఇలా..

ఇండోర్‌స్టేడియంలో శనివారం మూడు మ్యాచ్‌లు నిర్వహించనున్నామని పీఈటీలు వెల్లడించారు. మహిళల విభాగంలో చేపలతూము సెంటర్ సచివాలయ జట్టుతో గొల్లాయిగూడెం సచివాలయం జట్టు, రాజీవ్‌గాంధీ పార్కు సచివాలయం జట్టుతో అరుంధతిపేట సచివాలయం జట్టు తలపడనున్నాయి. పురుషుల విభాగంలో పోస్టల్ కాలనీ సచివాలయ జట్టుతో గొల్లాయిగూడెం సచివాలయం జట్టు తలపడాలని నిర్వాహకులు తెలిపారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	30	బీన్లచిక్కుడు	64
వంకాయలు (తెలుపు)	--	చామదుంపలు	60
బెండకాయలు	28	ములక్కాడలు	10–12
పచ్చిమిర్చి	42	కంద	52
కాకర కాయలు	50–54	బీట్‌రూట్	36
బీరకాయలు	50	కీర దోస	30
బీరకాయలు (పందిరి)	60	ఫ్రెంచ్‌బీన్స్	92
క్యాబేజీ	24	అల్లం	120
క్యారెట్	56	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	26	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	36	గోంగూర	08
దోసకాయలు	40	పుదీనా	05
ఆనబకాయ (1)	25–30	క్యాప్సికమ్	92
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	30

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	03
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	00
ఏలూరు - బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	01
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	00
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్ఈఎల్	22.15	4822	00
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	రద్దు
ఏలూరు - తిరుపతి	16.00	4830	రద్దు
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	985172	20
ఏలూరు - బీహెచ్ఈఎల్	22.30	98508	05

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సంతృప్తికరం

ఏలూరు(మెట్రో): పేదల అభివృద్ధే లక్ష్యంగా నిర్వహిస్తోన్న వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఏలూరు జిల్లాలో సంతృప్తికరంగా నిర్వహిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ (మహిళలు, పిల్లలు, యూత్ - స్పోర్ట్స్) వివేక్ ఠాకూర్ కితాబునిచ్చారు. ఏలూరు జిల్లాలో మూడు రోజులు పర్యటనలో భాగంగా శుక్రవారం ఏలూరు కలెక్టరేట్‌కు విచ్చేసిన వివేక్ ఠాకూర్‌కు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి పుష్పగుచ్ఛం, పూలమొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివేక్ ఠాకూర్ మాట్లాడుతూ తాను పాల్గొన్న వికసిత్ భారత్ సంకల్పయాత్రల్లో ప్రజల నుంచి మంచి స్పందన కనిపించిందన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జిల్లా యంత్రాంగానికి ఆయన అభినందనలు తెలిపారు. కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం అనంతరం వివేక్ ఠాకూర్‌ను జిల్లా కలెక్టర్ శాలువతో సత్కరించి మెమెంటోను అందజేశారు.



ఠాకూర్‌ను సత్కరిస్తున్న కలెక్టర్, జేసీలు

కోడిపందేల శిబిరంపై పోలీసుల దాడి

పెదవేగి : కోడిపందేల శిబిరంపై దాడి చేసిన పోలీసులు తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై ఎం లక్ష్మణ్ శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పులవారిగూడెంలో కోడిపందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా, ఘటనా స్థలంలో 9 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.66,200 నగదు, 4 కోడిపుంజులు, కారు, 3 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

కుల గణన సర్వే ప్రారంభం


భీమడోలులో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

భీమడోలు: కుల గణన కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఈనెల 28వ తేదీ నాటికి ఈ సర్వే పూర్తి చేయాల్సి ఉంది. మండలంలోని 17 గ్రామ సచివాలయాల్లోని 356 మంది వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు 62,957 కుటుంబాల ఇంటింటికీ వెళ్లి పారదర్శకంగా సర్వే చేస్తారు. ఇంటి పెద్ద నుంచి పారదర్శకంగా డేటాను సేకరించి వారి నుంచి వేలిముద్రను తీసుకోవాలి యాప్‌లోని రెండు విభాగాల్లో పొందుపర్చిన అంశాలను కుటుంబ సభ్యుల నుంచి అడిగి వారి వివరాలు సేకరిస్తున్నారు. దీంతో పశుపక్ష్యాదులు, వారి ఆస్తి వివరాలు, కులాల వారీగా వారి పూర్తి డేటా తెలుస్తుంది. మొదటి విభాగంలో పశువులు, వారి ఆస్తి పాస్తుల వివరాలు, ఇంటి స్టేటస్ వివరాలు సేకరిస్తారు. రెండో విభాగంలో వారి కులాలను తెలుసుకుని వాటిని నమోదు చేసారు. విధిగా కుటుంబంలోని ఒక వ్యక్తితో వేలి ముద్ర వేయించుకుంటారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు వారు వేలిముద్రను వేస్తారు. శుక్రవారం భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి కుల గణనను పరిశీలించి వారికి పలు సూచనలందించారు.

జాతీయస్థాయి పోటీలకు గణపవరం విద్యార్థి ఎంపిక


పన్నాసి సురేష్

గణపవరం: గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి చదువుతున్న పన్నాసి సురేష్‌కు జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో పాల్గొనే అవకాశం లభించింది. ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకూ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాయపూర్‌లో నిర్వహించే జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో సురేష్ పాల్గొంటున్నాడు. గత నెలలో రాష్ట్రస్థాయిలో కాకినాడ జిల్లా పిఠాపురంలో నిర్వహించిన సాఫ్ట్ టెన్నిస్ పోటీల్లో గెలిచి, జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. విద్యార్థికి శిక్షణనిచ్చిన పీడీ పద్మావతిని ఎంఈవోలు పుచ్చల శేషు, జి.బాలయ్య, హెచ్‌ఎం మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

అపరాల పంట పరిశీలన


కొత్తూరులో అపరాల పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్

పెదపాడు: మండలంలోని అపరాల పంటను మండల వ్యవసాయ అధికారి ప్రదీప్ కుమార్ అపరాల పంటలను పరిశీలించారు. పెసర పంటలో పల్లాకు తెగులు ఉధృతి ఎక్కువగా ఉండటంతో దీని నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పల్లాకు తెగులు తెల్లదోమ వ్యాప్తి చెందుతోందన్నారు. తెల్లదోమ నివారణకు ఇమిడా క్లోప్రిడ్ మందును పిచికారీ చేసుకోవాలని, పల్లాకు తెగులు నివారణకు థయోమెథాక్సమ్ మందును పిచికారీ చేయాలని మండల వ్యవసాయ అధికారి రైతులకు సూచించారు. దీంతోపాటు వేప నూనె ఎకరానికి లీటరు చొప్పున పిచికారీ చేస్తే రసం పీల్చు పురుగుల ఉధృతిని కొంతమేర తగ్గించుకోవచ్చునని తెలిపారు. తెగుళ్లను ప్రాథమిక దశలోనే నివారణ చర్యలు తీసుకుంటే పంటలను రక్షించుకోవచ్చని అన్నారు.